క్లుప్తంగా

శుభ్రమైన నీటినే తాగాలి



తెనాలిరూరల్: ప్రజలు శుద్ధి చేసిన నీటినే తాగాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణ 30వ వార్డులోని అమరావతి ప్లాట్స్‌లో పురపాలక సిబ్బంది నీటి నమూనాలను సోమవారం సేకరించారు. కమిషనర్ నీటిని నమూనాలను పరిశీలించడంతో పాటు నీటిని తాగి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘం ఆధ్వర్యంలో రక్షిత తాగునీటిని అందిస్తున్నామని చెప్పారు. బోర్ల నీరు వినియోగించే వారు నీటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలానే 29వ వార్డులో మార్కెట్ యార్డు, జిల్లా ప్రభుత్వ వైద్యశాల, అన్న క్యాంటీన్ల వద్ద పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు.

గ్రీవెన్స్‌లో 12 అర్జీలు

తెనాలిరూరల్: తెనాలి తహసీల్దార్, పురపాలక సంఘ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 12 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూకు సంబంధించి రెండు, ఎంపీడీఓకు సంబంధించి రెండు, పురపాలక సంఘానికి సంబంధించి ఒకటి, పోలీసు శాఖకు సంబంధించి ఒకటి ఉన్నాయి. అలానే పురపాలక సంఘంలో కమిషనర్ శేషన్న గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రజలతో మాట్లాడారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి రెండు, హెల్త్ సెక్షన్‌కు సంబంధించి ఒకటి, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి మూడు అర్జీలు వచ్చాయి. వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

తెనాలిరూరల్: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా శాంతి ఆశ్రమం, నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాలయాల్లో వృద్ధులకు సోమవారం ఆహారం, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. తాడికొండ మండలం మోతడకలోని చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులు సేవ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగశ్రీనివాసరావు, డీన్ పి.ఫణికుమార్, సీఎస్ఈ విభాగాధిపతి జి. రామచంద్రరావు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

తెనాలిరూరల్: గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమందించారు. పట్టణ బాలాజీరావుపేటలో ఆలపాటి వారధి నుంచి రైల్వేస్టేషన్ రోడ్డులోకి వెళ్లే వీధిలో పాడు బడిన దాల్ మిల్లు మెట్ల వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉండడాన్ని స్థానికులు సోమవారం సాయంత్రం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతుడి వయసు సుమారు 30 నుంచి 35 ఉంటుంది. నీలం రంగు జీన్సు ప్యాంటు, నలుపు, కాఫీ కలర్ నిండు చేతుల షర్టు ధరించి ఉన్నాడు. ఎడమ చేయి చిటికెన వేలుకు సాయిబాబు ఉంగరం ఉంది. మృతి చెంది నాలుగు రోజులు అయి ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యావనరుల కార్యాలయంలో చోరీ



ప్రత్తిపాడు: మండల విద్యావనరుల కార్యాలయంలో చోరీ జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని మండల విద్యావనరుల కార్యాలయానికి శనివారం సాయంత్రం కార్యాలయ సిబ్బంది ఎప్పటిలానే తాళాలు వేసి వెళ్లిపోయారు. ఆదివారం సెలవు కావడంతో సోమవారం ఉదయం కార్యాలయ అటెండర్ రేణుక ఆఫీసుకు వచ్చారు. అప్పటికే కార్యాలయ ప్రధాన ద్వారంతో పాటు ఎంఈవో-1 గదికి ఉన్న తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. వెంటనే విషయాన్ని ఎంఈవో సీహెచ్ రమాదేవికి ఫోన్ ద్వారా తెలియజేశారు. వారు వచ్చి పరిశీలించగా హాల్‌లో ఉండాల్సిన 43 ఇంచెస్ ఎల్ఈడీ స్మార్ట్ టీవీని ఆగంతకులు అపహరించుకుపోయినట్లుగా గుర్తించారు. దీంతో ఎంఈవో రమాదేవి ప్రత్తిపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కాగా ఇదే కార్యాలయంలో గతంలోనూ గుర్తు తెలియని వ్యక్తులు బ్యాటరీలు, ఇన్వర్టర్లను దొంగిలించారు.

వెంకటాద్రి పేటలో కరెంటు కోతలు

నెహ్రూనగర్: స్థానిక నెహ్రూనగర్ చివర ఉన్న వెంకటాద్రి పేటలో కరెంటు కోతలు ఎక్కువైపోతున్నాయి. సోమవారం తెల్లవారుజామున 3.30 గంటలకు కరెంటుపోయి 6 గంటల వరకు ఇవ్వలేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న న్యూ గుంటూరు రైల్వే స్టేషన్ రోడ్డులో కరెంటు ఉన్నప్పటికీ వెంకటాద్రి పేటలో కరెంటు పోవడం ఏమిటంటూ అంటూ స్థానికులు మండిపడుతున్నారు. ఎస్సీ కాలనీ కావడం వల్లే అధికారులు చిన్నచూపు చూస్తున్నారంటూ వారంతా ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కరెంటు కోతల నుంచి తమ పేటకు విముక్తి కలిగించాలని వారంతా కోరుతున్నారు.

ఉన్నత విద్యనభ్యసించడం లక్ష్యం కావాలి



ఐతానగర్ స్కూల్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న మానవత బాధ్యులు



పెదరావూరులో భోజనాలు అందజేస్తున్న వెంకటపూర్ణచంద్, హెచ్‌ఎం సరళ

మానవత చైర్మన్ కొలసాని రామ్‌చంద్

తెనాలి: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అయితానగర్‌లోని ఎన్ఎస్ఎస్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలోని 450 మంది విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 'శుభ భోజన్ దిన్'ను నిర్వహించారు. మధ్యాహ్న భోజనం సమయంలో మానవత బాధ్యులు విద్యార్థులకి పండ్లు పంపిణీ చేశారు. అమ్మ హాస్పిటల్ అధినేత డాక్టర్ జె.శివప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సంస్థ, తెనాలి చైర్మన్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఉపాధ్యాయులు ఉంటారనీ, విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత విద్యలు అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో డీవీ సోమయ్య శాస్త్రి, కన్వీనర్ తన్నీరు శ్రీనివాసబాబు, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ కటకం ప్రసాద్, సెక్రటరీ పి.వెంకట్, వైస్ ప్రెసిడెంట్ పరిమి శ్రీనివాస్, మహిళ విభాగం అధ్యక్షురాలు కళ్యాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెదరావూరు హైస్కూలులో..

తెనాలిరూరల్: మండలంలోని పెదరావూరు గ్రామంలోని జెడ్పీ హైస్కూలులో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో చివరిరోజైన సోమవారం తిథి భోజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు భోజనం ఏర్పాటు చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు, మిత్ర వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈదర వెంకటపూర్ణచంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భోజనంతో పాటు స్వీట్లు సమకూర్చారు. విద్యార్థులు తయారు చేసిన బోధనాభ్యాస సామగ్రిని పరిశీలించారు. కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయురాలు పి.సరళ, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

ప్రపంచ వారసత్వ కమిటీ సమావేశాలకు డాక్టర్ ఈమని



డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

తెనాలి: భారత ప్రభుత్వ ఆతిథ్యంలో దేశరాజధాని ఢిల్లీలో 195 దేశాలు పాల్గొంటున్న 46వ ప్రపంచ వారసత్వ కమిటీ సమావేశాలకు తెనాలికి చెందిన పురావస్తు పరిశోధకుడు, వారసత్వ పరిరక్షణ నిపుణుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి హాజరయ్యారు. ప్రస్తుతం తెలంగాణాలోని ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ బాధ్యతల్లో ఉన్న ఆయన్ను ఆ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అతిథిగా ఈ సమావేశాలకు నామినేట్ చేసింది. ఢిల్లీలోని భారత మండపంలో రెండురోజులపాటు నిర్వహించనున్న అంతర్జాతీయ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. యునెస్కో సభ్యదేశాలు, తమ దేశాలకు చెందిన పురాతన స్థలాలు, కట్టడాలు, సుందర ప్రకృతి ప్రదేశాలకు ప్రపంచ వారసత్వ జాబితాలో చోటు కోసం పంపే ప్రతిపాదనలను ఈ సమావేశాల్లో చర్చిస్తారని డాక్టర్ శివనాగిరెడ్డి తెలిపారు. అప్పటికే తాత్కాలిక జాబితాలో చోటు దక్కించుకొన్న వాటిపై ఎన్నిక ప్రక్రియ జరుగుతుందని, ఆసక్తికరంగా సాగే చర్చల ద్వారా, కొత్త ప్రతిపాదనల నివేదికల తయారీకి అవసరమైన నైపుణ్యాన్ని సంతరించుకొనే వీలు చిక్కిందని వివరించారు. తనతో పాటు వారసత్వ నిపుణులు, వాస్తు శిల్పులు(ఆర్కిటెక్టులు) మణికొండ వేదకుమార్, ఎం.పాండురంగారావు, డాక్టర్ శోభా, ప్రొఫెసర్ కేపీ రావు, డాక్టర్ పద్మనాభలను తెలంగాణ ప్రభుత్వం నామినేట్ చేసిందని, అవకాశమిచ్చిన తెలంగాణ ప్రభుత్వ పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శికి, ప్రభుత్వానికి శివనాగిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం శ్రీరామకృష్ణ హైస్కూల్‌లో పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం సోమవారం ప్రాతూరు రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. 1987 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సుమారు 60 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను తలచుకుంటూ ఈ కార్యక్రమం నిర్వహించామని, 37 సంవత్సరాల కిందటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపామని తెలిపారు. ఈ కార్యక్రమానికి పూర్వవిద్యార్థులు దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, చందు, మస్తాన్, రఘు, ఉదయలక్ష్మి తదితరుల ఆధ్వర్యంలో జరిగింది.

జెండర్ సెన్సిటైజేషన్‌తోనే అభివృద్ధి సాధ్యం

డాక్టర్ వీరరాఘవరావు



డాక్టర్ వీరరాఘవరావును సత్కరిస్తున్న కేఎల్‌యూ డీన్ డాక్టర్ కె.ఆర్.ఎస్. ప్రసాద్

తాడేపల్లిరూరల్: సమాజంలో సమానత్వం, గౌరవాన్ని పెంపొందించడంలో జెండర్ సెన్సిటైజేషన్ ఒక కీలకమైన ప్రయత్నమని గుంటూరు ఆత్కూరి వెంకటలక్ష్మి ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ ఎ.వీర రాఘవరావు అన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో స్వహస్తి ఫౌండేషన్ సహకారంతో సోమవారం జెండర్ సెన్సిటైజేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీర రాఘవరావు మాట్లాడుతూ గుర్తింపు, పాత్రల సంక్లిష్టతలను గురించి వ్యక్తులకు అవగాహన కల్పించడంతో పాటు సమాజంలో ఎప్పటి నుండో పాతుకుపోయిన మూస పద్ధతులకు స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. ఆడ, మగ అనే భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ గౌరవంగా, న్యాయంగా వ్యవహరించే వాతావరణాన్ని ప్రోత్సహించాలని కోరారు. లింగ పక్షపాతాల గురించి సంభాషణలలో చురుకుగా పాల్గొనడం, అందరికీ కలుపుకుని ఉన్న అభ్యాసాల కోసం వాదించడం ద్వారా, తాము వివక్షతతో కూడి నిబంధనలను తొలగించి సమానమైన సమాజాన్ని సృష్టించగలమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేఎల్‌యూ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూతు రమ్య, కో కన్వీనర్ ఎన్.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించాలి

ఎండీఎం అసిస్టెంట్ డైరెక్టర్ నిర్మలారాణి



విద్యార్థినులకు పాయసాన్ని అందజేస్తున్న ఎండీఎం ఏడీ నిర్మలారాణి, ఖాసిం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ఖచ్చితంగా పాటించి, బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించాలని డీఈవో కార్యాలయ మధ్యాహ్న భోజన పథక విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. నిర్మలారాణి పేర్కొన్నారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో శిక్ష సప్తాహ్‌లో భాగంగా చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాలలో తిథి భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనాన్ని ఆమె తనిఖీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం షేక్ ఎండీ ఖాసిం మాట్లాడుతూ విద్యార్థుల్లో సమిష్టి భావన పెంపొందించడంలో తిథి భోజన కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ నూతలపాటి వీర ప్రకాశరావు, జైన్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎండీ మున్ను సహకారంతో విద్యార్థులకు లడ్డూలు, సేమియా, సగ్గుబియ్యం పాయసాన్ని అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన విభాగ సూపరింటెండెంట్ సాంబశివ రావు, సిబ్బంది మాధవి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాబియా బస్రీ, పాఠశాల కమిటీ చైర్మన్ సుభానీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రియాంకకు డాక్టరేట్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ బయోటెక్నాలజీ విభాగ పరిశోధకురాలు జి ప్రియాంకకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్‌సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. బయోటెక్నాలజీ పరిశోధనా పర్యవేక్షకులు డాక్టర్ ఎ.కృష్ణ సత్య పర్యవేక్షణలో 'సోయ్ మిల్క్ నుంచి వేరు చేయబడిన మైక్రోఎన్ క్యాప్స్‌లేటెడ్ ల్యాబ్స్ సర్వైవల్, స్థిరత్వం' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకుగాను డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగిందన్నారు.

బ్యాగులో నగదు, బంగారం చోరీపై కేసు నమోదు


గుంటూరు ఈస్ట్: వివాహ శుభకార్యంలో బ్యాగులోని డబ్బులు, నగలుచోరీకి గురైన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం ఏ కన్వెన్షన్ హాలులో ఆదివారం వివాహం జరుగుతోంది. వినోబానగర్‌కు చెందిన మహిబూర్ రెహమాన్‌కు చెందిన బ్యాగులో రూ.15 వేలు నగదు, పదిసవర్ల బంగారు గొలుసు చోరీకి గురయ్యాయి. రెహమాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యతిరాజుల బాలబాలాజీకి సాహిత్య శాస్త్ర మర్మజ్ఞ బిరుదు



నగరంపాలెం: వైఎస్ఆర్ జిల్లా గండి క్షేత్రంలో ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు అఖిల భారత బ్రాహ్మణ మహం సంఘ్ విద్వత్ పంచాంగ సభలు జరగ్గా, అఖిల భారత శ్రీవైష్ణవ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, గుంటూరుకు చెందిన యతిరాజుల బాలబాలాజీకి సాహిత్య శాస్త్ర మర్మజ్ఞ బిరుదు, శ్రీ గురు పురస్కార అవార్డు అందజేశారు. ఈ మేరకు బాలబాలాజీ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు సాహిత్యంలో, పురాణ ఇతిహాసాలలోని శాస్త్రీయ, సాంకేతిక విలువలను గుర్తించి, విద్యార్థులకు భారతీయ సనాతన జ్ఞానం గొప్పదనాన్ని తెలిపినందుకు బిరుదును ఏబీబీఎం సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఇంద్రకంటి ప్రసాదశర్మ అందజేశారని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ విధులను బాధ్యతతో నిర్వర్తించాలి



గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఉద్యోగమంటే కేవలం ఉపాధి మాత్రమే కాదని, అంతకు మించిన బాధ్యత అని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కింద ముగ్గురు దివ్యాంగులకు నియామక పత్రాలు అందజేశారు. అందులో నెమలికంటి పవిత్ర, దొప్పలపూడి వినోద్‌కుమార్, చిట్టిబొమ్మ కనకారావు ప్రభుత్వ ఉద్యోగులుగా పత్రాలు అందుకున్నారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించడంతోపాటు, సహచర సిబ్బందితో సఖ్యతో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో జేసీ ఎ.భార్గవ్‌తేజ పాల్గొన్నారు.

యువకుల ఆత్మహత్యాయత్నం

పొన్నూరు: మండల పరిధిలోని నండూరు గ్రామంలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఇరువురు యువకులు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం గ్రామంలోని వేర్వేరు కుటుంబాలకు చెందిన అభిరామ్, మహేష్ తల్లిదండ్రులు మందలించడంతో పురుగు మందు తాగినట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు వెంటనే పొన్నూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించడంతో చికిత్స పొందుతున్నారు.

ఎట్టకేలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రత్తిపాడు: ప్లస్ టూ విద్యార్థులకు ఎట్టకేలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రత్తిపాడు భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని జూనియర్ కళాశాల (ప్లస్ టూ) విద్యార్థులకు క్లాసులు ప్రారంభమై దాదాపు 40 రోజులు గడుస్తున్నా నేటి వరకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చెయ్యలేదంటూ ఈ నెల 29న 'సాక్షి'లో 'పుస్తకం లేని పాఠం' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ప్రభుత్వ పాఠ్యపుస్తకాల డైరెక్టర్ కె.రవీంద్రరెడ్డి పుస్తకాలు పంపిణీ చెయ్యకపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. ప్రత్తిపాడు మండల విద్యాశాఖ అధికారులకు ఫోన్ చేసి సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈవో శైలజ వెంటనే విచారించి తనకు విషయాన్ని తెలియజేయాలని ఎంఈవోలను ఆదేశించారు. అనంతరం హెచ్‌ఎం హెచ్.శ్రీనివాసరావు, ఎంఈవోలు సీహెచ్ రమాదేవి, లీలారాణిలు స్థానిక టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించారు.

సమయపాలనే విజయానికి సోపానం

మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: అవకాశం వచ్చినపుడు తగిన టాలెంట్‌ను ప్రదర్శించే వారే సక్సెస్ కాగలరని ఏఎస్ఎన్ విద్యా సంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజిలో 'బ్రేక్ ది ప్రొక్రాస్టినేషన్' పేరుతో వారానికి 105 గంటల ఛాలెంజ్ ప్రోగ్రాంను నిర్వహించారు. 530 మంది విద్యార్థులకుగాను 286 మంది వందకన్నా ఎక్కువ గంటల సాధించారు. వీరికి సర్టిఫికెట్ల ప్రదానోత్సవాన్ని సోమవారం సాయంత్రం కాలేజి సెమినార్ హాలులో ఏర్పాటు చేశారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి శివకుమార్ మాట్లాడుతూ, జీవితం ఎవరికీ వడ్డించిన విస్తరి కాదనీ, డబ్బు కలిగిఉండటంతోనే అన్నీ ఉన్నట్టు కాదని గుర్తుచేశారు. ఫెయిల్యూర్స్‌కు బెంబేలెత్తి పోకూడదన్నారు. ఫెయిల్యూర్స్ నుంచి, పరిస్థితుల నుంచి పాఠాలను నేర్చుకోవాలని కోరారు. జీవన కళలు, భావవ్యక్తీకరణ శిక్షణ ఇందుకు బాగా ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ, ఉత్తమమైన మానవ వనరులు కలిగిన సంస్థ అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ప్రతిభ ఉండటమే కాకుండా, విధుల నిర్వహణలో సమయపాలన మరింత ముఖ్యమని అన్నారు. విద్యార్థులకు సమయపాలన అలవర్చేందుకు నిర్వహించిన రోజులో 15 గంటల ఛాలెంజ్‌ను అత్యధిక మంది విద్యార్థులు గెలవటం సంతోషంగా ఉందన్నారు.

చిన్న సినిమాల విడుదలకు సదవకాశం

- తెలంగాణలో పర్సంటేజ్ విధానం
- ఆంధ్రలోనూ అమలు చేయాలి
- 'మా-ఏపీ' వ్యవస్థాపకుడు దిలీప్ రాజా



మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలి: తెలంగాణలో ఆగస్టు 2వ తేదీ నుంచి థియేటర్లలో సినిమాల ప్రదర్శనకు పర్సంటేజీ విధానం ఆచరణలోకి వస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇదే పద్ధతిని అమలు చేయాలని 'మా-ఏపీ' వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మరో సినీదర్శకుడు అచ్చన శ్రీనివాసయాదవ్‌తో కలసి సోమవారం స్థానిక 'మా-ఏపీ' 24 విభాగాల యూనియన్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో మాదిరిగా థియేటర్లకు అద్దె చెల్లించకుండా పర్సంటేజీ పద్ధతి అమల్లోకి వస్తే, చిన్న సినిమా నిర్మాతలకు ఎంతో ఉపయోగమన్నారు. వెంటిలేటర్ పై ఉన్న థియేటర్లు బతుకుతాయని అన్నారు. గ్లోబల్ ఫిలింస్ సునీల్ నారంగ్, ఎస్వీ క్రియేషన్స్ శిరీష్‌రెడ్డి దగ్గర హైదరాబాద్‌లో ఏవిధంగా అగ్రిమెంట్లు జరుగుతున్నాయో అలాగే, అగ్రిమెంట్లును రూపొందించుకోవాల్సిందిగా ఆంధ్రకు చెందిన చిన్న నిర్మాతలకు ఆయన సూచించారు. దయచేసి ఖాళీ అగ్రిమెంట్లను ఎవరూ ఇచ్చి రావద్దని చెప్పారు.

సినీదర్శకుడు అచ్చన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ భారత దేశంలోని అన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్లకు పర్సంటేజీ విధానంలో షేర్ వస్తుందని, ఏపీలో థియేటర్ల యాజమాన్యం, కంట్రోలర్ అసోసియేషన్ సహకరించాలని కోరారు. వీరితో కో-డైరెక్టర్ ఇంటూరి విజయభాస్కర్, సిద్దెల మనోహర్ ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో బీటీఏ



అంబేద్కర్, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పుష్పాంజలి

తెనాలి: బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) 24వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం సాయంత్రం స్థానిక ఎన్జీవో హోమ్‌లో నిర్వహించారు. బీటీఏ రాష్ట్ర కార్యదర్శి బట్టు వెంకయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆలిండియా బీటీఏ అదనపు కార్యదర్శి గడ్డం ఏలియా మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసిన బీటీఏ ఉపాధ్యాయులకు సంబంధించిన అనేక సమస్యలను పరిష్కరించిందని చెప్పారు. రాష్ట్ర డెప్యూటీ జనరల్ సెక్రటరీ ఆర్.మధు మాట్లాడుతూ అమరావతి కేంద్రంగా బహుజన గళాన్ని బీటీఏ తరఫున ప్రచారం చేయాలని సూచించారు. రాష్ట్ర కార్యదర్శి గురిందపల్లి వేమయ్య తన ప్రసంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఉపాధ్యాయుల సమస్యలపై బీటీఏ పోరాటం చేస్తుందని తెలిపారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, భారతదేశ ప్రధాన మహిళా ఉపాధ్యాయిని సావిత్రి బాయి పూలే చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. సమావేశంలో పాలపర్తి బాలాజి, చేబ్రోలు కిషోర్‌బాబు, కంచర్ల హీరమ్స్, ఎన్.సురేష్‌బాబు, దారం ప్రకాశరావు, కిరణ్‌కుమార్, తెనాలి జయపాల్, కంచర్ల రమేష్ పాల్గొన్నారు.

ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి

ఇన్‌చార్జి కమిషనర్ శ్యామ్ సుందర్



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ శ్యామ్ సుందర్

నెహ్రూ నగర్: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్, ఎస్ఈ శ్యామ్ సుందర్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో విభాగాధిపతులతో కలసి ప్రజల నుంచి ఫిర్యాదులు సోమవారం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులు రీ ఓపెన్ కాకుండా క్షేత్రస్థాయి పరిశీలన చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సదరు ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని కోరారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలని చెప్పారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారిగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు. 24 ఫిర్యాదులు రాగా వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 4, ఇంజినీరింగ్ విభాగానికి 6, రెవెన్యూ విభాగానికి 3, ప్రజారోగ్య విభాగానికి 4, అకౌంట్స్ విభాగానికి 3, ఉపాసెల్ విభాగానికి 2, ఎన్నికల విభాగానికి 1, సచివాలయాల విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, వెంకటలక్ష్మి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్‌ఓ మధుసూదన్, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

కారణజన్ములు డాక్టర్ వెంపటి సత్యం



శ్రీనటరాజమూర్తి విగ్రహం అందిస్తున్న దృశ్యం

నగరంపాలెం: కూచిపూడి నృత్యాన్ని ప్రపంచానికి తెలిసేలా చాటి చెప్పిన కారణ జన్ములు డాక్టర్ వెంపటి సత్యం అని డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ కూచిపూడి నృత్య గురువు పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చిన సత్యం 12వ వర్ధంతి సభ నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సి.హెచ్.మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ భూసురపల్లి కూచిపూడి నాట్యానికి సంబంధించిన పలు అంశాలను ఆసక్తికరంగా సభలో విశదీకరించారు. అనంతరం కూచిపూడి బాలత్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వర స్వామి వారి దేవాలయానికి బ్రహ్మాజీ చెక్కిన నటరాజ శిల్పాన్ని ఆయన అందించారు. అనంతరం అకాడమీ శిష్యులు వెంపటి చినసత్యం నృత్యీకరించిన పలు నృత్యాంశాలను హృద్యంగా నర్తించారు. కళాకారులను సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజా వేంకట సుబ్రహ్మణ్యం సత్కరించగా, కార్యక్రమాలను సంస్థ కోశాధికారి వెంకటగిరి నాగలక్ష్మి, ఊటుకూరి నాగేశ్వరరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో కూచిపూడి సిద్ధేంద్ర కళాక్షేత్రం విశ్రాంత ప్రధానోపాధ్యాయులు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, ప్రముఖ రచయిత అమర్తలూరి వీరబ్రహ్మేంద్రరావు, బొల్లేపల్లి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, విశ్వ సంకీర్తనాచార్య తుర్లపాటి శంభయాచార్య పాల్గొన్నారు.